క్లుప్తంగా

జర్నలిస్టుల డైరీ ఆవిష్కరణ

మధురవాడ: సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమైనదని జీవీఎంసీ జోన్–2 ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీడీ ఫణిరాం చెప్పారు. ఆదివారం మధురవాడ మా మీడియా కార్యాలయంలో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన డైరీని ఆయన ఆవిష్కరించి, డైరీతో పాటు మిఠాయిలను పాత్రికేయులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా స్రా్క సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఎస్‌సీఆర్‌డబ్ల్యూ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగార అశోక్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

తీరంలో సంక్రాంతి సంబరాలు



నగరపాలెంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న స్థానికులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తీర ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు ముందే ప్రారంభమయ్యాయి. కె. నగరపాలెంలో స్థానికులందరూ కలసి ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నేటి తరానికి సంక్రాంతి ప్రాముఖ్యతను వివరిస్తూ గంగిరెద్దుల విన్యాసాలు, ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. హరిదాసులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం నేడు

తగరపువలస: స్థానిక వెంకటేశ్వరమెట్టపై గల శ్రీవారి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు రాజగిరి కుసుమహర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముక్కోటి ఏకాదశి నుంచి ఆలయంలో హుండీలను తొలగించినట్టు తెలిపారు.

జీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటల్లో పాల్గొన్న క్రీడాకారులు

కొమ్మాది: గొల్లల ఎండాడలో గోపాలకృష్ణ యూత్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న గొల్లల ఎండాడ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) టి–20 క్రికెట్ పోటీలను ఆదివారం వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు ప్రారంభించారు. మొత్తం ఆరు జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. గోపి, రాంబాబు పాల్గొన్నారు.

బాల వికాస్ విద్యార్థులకు యూనిఫాంల వితరణ



బాల వికాస్ విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న గురువులు

పద్మనాభం: మండలంలోని విజయానందపురంలోని బాల వికాస్ కేంద్రంలో 24 మంది విద్యార్థులకు యూనిఫారంలను రెడ్డిపల్లి సత్యసాయి సేవా సమితి భజన మండల కన్వీనర్ వైదా గురునాథరావు ఆదివారం వితరణగా ఇచ్చారు. వీటిని గురువులు పి.సుస్మిత, ఎం.కోమలి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

విద్యార్థిని భరణి మృతిపై నివేదిక ఇవ్వాలి

పద్మనాభం: తగరపువలస శ్రీ బాసరా కాలేజీకి శనివారం బస్సులో వెళుతూ విద్యార్థిని కోండ్రు భరణి(17) మృతి చెందిన ఘటనపై వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఘటనను సుమోటగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ప్రారంభం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజుల పాటు ఎన్‌సీసీ విద్యార్థులకు జరుగనున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 356 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. మొదటి రోజు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.



తగరపువలస మెయిన్ రోడ్డులో ప్రత్యేక వస్త్రాల షాపు

సంక్రాంతి స్పెషల్

చనిపోయిన వారికి సంక్రాంతి సమయంలో వీలు కాకపోతే మహా శివరాత్రి రోజు చీరలు, పంచెలు సమర్పిస్తారు. అలా చేస్తే చనిపోయిన వారు తమ కుటుంబాన్ని కాచి కాపాడుతారన్నది నమ్మకం. వస్త్రాలు సమర్పించకపోతే పూర్వీకులు సంతోషించరని విశ్వసిస్తారు. ఈ ప్రత్యేక వస్త్ర విక్రయాలు ధనుర్మాసంతోనే ప్రారంభమవుతాయి. తగరపువలస మార్కెట్ కేంద్రంగా వీటి వ్యాపారం నెలరోజుల పాటు రూ.50 లక్షల పైచిలుకు జరుగుతుంది. ఈ వ్యాపారం సంక్రాంతి, మహా శివరాత్రి సందర్భంగా ఎక్కువగా ఫుట్‌పాత్‌ల మీదే సాగుతుంది.



పితృదేవతల వస్త్రాలకు ప్రత్యేక మార్కెట్



ప్రత్యేక వస్త్రాలు విక్రయిస్తున్న వ్యాపారి

తగరపువలస: సంక్రాంతి పండగతో పాటు దానికి వారం రోజుల ముందు ఇళ్లల్లో జరిగే వంట మడపళ్ల కార్యక్రమంలో తమ పూర్వీకులు, పితృదేవతలు, పేరంటాళ్లకు కొత్త దుస్తులు సమర్పించడం మన సంప్రదాయం. వారికి పంచెలు, తువ్వాళ్లు, చీరలు సమర్పిస్తారు. బాల్యంలో చనిపోయిన ఆడపిల్లలను పేరంటాళ్లుగా, మగవారిని వీరుబాబులుగా కొలుస్తారు. వీరికి సమర్పించిన వస్త్రాలను సాధారణంగా ఎవరూ వినియోగించరు. అలాగే అంటువ్యాధులు సోకి చనిపోతే పెద్దలుగా పిలుచుకుంటారు. ప్రమాదవశాత్తూ, కాలం తీరి చనిపోయిన వారికి సంక్రాంతి రోజునే కొత్త వస్త్రాలు సమర్పిస్తారు. పేరంటాళ్లు, వీరుబాబులు, పెద్దలకు పంచమడపళ్ల రోజు అన్నం, పప్పు, కలగూర, పొంగడాలు, బూరెలు, అట్లను నైవేద్యంగా పెట్టి, పంచెలు, చీరలను సమర్పిస్తారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక వస్త్రాలు చనిపోయిన వారిని దేవుని గదిలోకి తీసుకువచ్చేటప్పుడు (మూలకు తెచ్చేటప్పుడు), గృహప్రవేశం, పూజలు, దానాల సమయంలో అవసరమవుతాయి. ఈ ప్రత్యేక వస్త్రాలకున్న డిమాండ్ కారణంగా వస్త్ర దుకాణాల యజమానులు ప్రత్యేక కౌంటర్ల ద్వారా వీటిని విక్రయిస్తుంటారు. ఫుట్‌పాత్‌లపై కూడా ప్రత్యేకంగా విక్రయిస్తారు.

వాళ్లు మెచ్చే వస్త్రాలే ఉండాలి..

చనిపోయిన వారు బతికి ఉండగా ఎక్కువగా ధరించిన లాంటి వస్త్రాలు, వారి మెచ్చిన దుస్తులే వారి మరణానంతరం సమర్పిస్తారు. వాటి, రంగు, బోర్డర్‌లను బట్టి గోరంచు, జీపు, పొందూరు, పొత్తంచు, బొందుకట్టు, తొగడ, మొగ్గల, గ్లాస్కో, బియ్యం మొగ్గల, బాణాల చీరలను ఎంపిక చేస్తారు. ప్రతి ఏటా అలాంటి వాటినే చూపిస్తారు. చిన్నవాటిని పంచెగా, రెండు పంచెలను చాపుగా పిలుస్తారు. పంచె నాణ్యతను బట్టి రూ.150 నుంచి రూ.250 వరకు, నేత చీరలు రూ.300 నుంచి రూ.2వేల వరకు ధర ఉంటాయి. గతంలో నేత కార్మికులు ఎక్కువగా ఉండేవారు. ప్రస్తుతం పొందూరు, నల్లగొండ, పోచంపల్లి, మంగళగిరి, పోలవరం, పాట్నూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు.



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

కొన్ని రకాలు అందుబాటులో ఉండవు..



నేత కార్మికుల సంఖ్య తగ్గిపోవడంతో వినియోగదారులు కోరిన వాటిలో కొన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉండడం లేదు. యంత్రాలపై నేసిన వాటిని కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపించరు. వారికి అవసరమైన చీర ఒక్కోసారి ఎంత ధర చెల్లించినా మార్కెట్‌లో దొరకదు.

– తెడ్లాపు అప్పలరాజు, వ్యాపారి.

ఆనవాయితీలకు పెద్దపీట



పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను అనుసరించి పంచెలు, చీరెలు పెద్దలకు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీలకు గ్రామాల్లో పెద్దపీట వేస్తూ కొనసాగిస్తున్నారు. నేత పరంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా ఈ ఆచారాల వల్ల ఇంకా చేనేత కార్మికుల మనుగడ కొనసాగుతోంది.

– అక్కరమాని మంగరాజు

పండక్కి పల్లెబాట పట్టిన జనం



మధురవాడ బస్టాప్ వద్ద బస్సుకోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



కొమ్మాది జంక్షన్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

కొమ్మాది: వేర్వేరు జిల్లాలు, ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగాల కోసం వచ్చి కొమ్మాది, మధురవాడ, పీఎంపాలెం, ఎండాడ, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు పయనమయ్యారు. దీంతో బస్టాప్‌లు, జంక్షన్లు ఫుల్ రష్‌గా మారాయి. ఇప్పటికే పాఠశాలలకు, స్కూళ్లకు సెలవులు ఇవ్వగా, ఉద్యోగులకు శనివారం, ఆదివారం అదనంగా సెలవు కలిసి రావడంతో కుటుంబాలతో కలసి పల్లెబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఎండాడ, మధురవాడ, కొమ్మాది బస్టాప్‌ల వద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలపై ఊళ్లకు జనం పయనమవడంతో కొమ్మాది జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ అయింది.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. బహుపరాక్

మధురవాడ: సంక్రాంతి పండగను తమ స్వగ్రామాల్లో జరుపుకొనేందుకు చాలా మంది వెళతారు. అలా ఊళ్లకు బయలుదేరిన వారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీఎం పాలెం క్రైం ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు. తీసుకోవలసిన జాగ్రత్తలపై మధురవాడ పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వతంత్రనగర్, నగరంపాలెం, ఉడా కాలనీ తదితర ప్రాంతాల్లో పోలీసులు కరపత్రాలు పంపిణీ చేసి, మైక్ ద్వారా ప్రచారం చేశారు. రాత్రి పూటే కాదు పగలు కూడా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకుని పోలీసులు సహాయాన్ని ఉచితంగా పొందాలని తెలిపారు. ఊరిలో లేదా ఇతర నివాస ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే 100లేదా 112కి ఫిర్యాదు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు పీఎంపాలెం క్రైం ఎస్ఐ ఫోన్ నంబర్ 94409 04314 , పోలీసు స్టేషన్ ఫోన్ నంబర్:0891–2721333లో సంప్రదించాలని కోరారు.



మధురవాడ పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు

స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు

ఘనంగా జయంతి



అయ్యప్పనగర్‌లో వివేకాందుని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు



భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున విద్యార్థులు

స్వామి వివేకానంద అందరికీ స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు తెలిపారు. వివేకానంద 162వ జయంతిని ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

– తగరపువలస/ మధురవాడ/ పద్మనాభం /పీఎంపాలెం/కొమ్మాది



పీఎంపాలెం తులసీ నగర్ పార్కులో నివాళులు అర్పిస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ కమిటీ సభ్యులు



నివాళులు అర్పిస్తున్న బీజేపీ ఎండాడ మండల అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు



పీఎంపాలెంలో సరస్వతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న బాలబాలికలు



పాండ్రంగిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న వార్డు మెంబర్ అప్పల రమణ



గోస్తనీ విద్యాపీఠ్‌లో నివాళులర్పిస్తున్న రాజీవ్ గాంధీ జాతీయ అవార్డు గ్రహీత రవి కుమార్

సరదాల సంక్రాంతి

సంక్రాంతి సందళ్లు ముందస్తుగానే ప్రారంభమయ్యాయి. ఊళ్లకు వెళ్లే జనంతో బస్టాప్‌లు, షాపులు, మార్కెట్‌లు కిటకిటలాడాయి. మరో వైపు పలు సంస్థలు ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడంతో చిన్నాపెద్దా అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసిన ముగ్గులు, ప్రదర్శించిన డూడూ బసవన్నల విన్యాసాలు అలరించాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

భీమునిపట్నం: సంక్రాంతి సందర్భంగా ఆదివారం భీమిలి ప్రెస్‌క్లబ్, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. భీమిలి బీచ్ పైలాన్ వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కె.శ్రీలత, ద్వితీయ, తృతీయ స్థానాల్లో డి.దేవి, జె.దేవి గెలుపొందారు. టి.రత్న, సీహెచ్.మణికి కన్సలేషన్ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సిటు ఆధ్వర్యంలో ..



అంబేడ్కర్ కూడలిలో చిన్నారుల కోలాట ప్రదర్శన

తగరపువలస: సిటు భీమిలి డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ కూడలిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా వివిధ జానపద కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

తగరపువలస: సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు వెళ్తున్న వారి వాహనాలతో రహదారులన్నీ నిండిపోయాయి. ఆనందపురం మండలంలోని బోయిపాలెం నుంచి తగరపువలస వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. పెందుర్తి నుంచి తగరపువలస వరకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లు కూడా కిక్కిరిసి పోయాయి. ఆనందపురం మండలం వేములవలస సర్కిల్‌లో రద్దీ కారణంగా పలుమార్లు వాహనాలు నిలిచిపోయాయి.



పెందుర్తి–తగరపువలస రహదారిలో వాహనాల రద్దీ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జాతరలో నృత్య ప్రదర్శన

పీఎంపాలెం: మధురవాడ శిల్పారామం జాతరలో ఆదివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విశాఖపట్నం కళారాధన మ్యూజికల్ అండ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారుల శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. నిర్వాహకులు టి.సందీప్‌కుమార్ నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన కార్యక్రమాలను శిల్పారామ పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పలు పోటీలు

తగరపువలస: చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం భోగి సందర్భంగా ఉదయం ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించనున్నారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మహిళలకు, చిన్నారులకు కుర్చీల పోటీలు, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 7 గంటలకు 12 ఏళ్ల లోపు చిన్నారులకు ఫ్యాషన్ షో పోటీలు, 7.30కు జాలరి నృత్యం, మ్యాజిక్ షో, డాల్ షో నిర్వహించనున్నారు. వివరాలకు 99492 28528, 99859 57499 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భీమిలి మండలం తాటితూరులో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పల్లంటి శ్యామ్‌సుందరరావు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నోరూరించే పిండివంటలు

- ఆర్డర్ ఇవ్వడమే తరువాయి... క్షణాల్లో సరఫరా
- సంక్రాంతి వేళ 'హోమ్‌ఫుడ్స్' బిజీబిజీ



బూరెలు, మినప సున్నుండలు

తగరపువలస: సంక్రాంతి పర్వదినాన వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా పలు హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు నోరూరించే పిండివంటలను అందుబాటులోకి తెచ్చారు. ఆర్డర్ ఇచ్చిన వెంటనే చిటికెలో సరఫరా చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది వీటిపై ఆధారపడుతున్నారు. పిండివంటల తయారీదారులు బిజీబిజీగా ఉన్నారు. పూర్వం ప్రతి ఇంట్లో రోకలితో పిండి దంచి, స్వయంగా పెనం వేసి అరిసెలు, సున్ని పాకుండలు, జంతికలు, గులాబీ పువ్వులు, సున్నుండలు తయారుచేసుకునేవారు. ప్రస్తుతం ఎవరికి వారు బిజీ జీవితంలో మునిగితేలు తుండటంతో సొంతంగా తయారు చేయడం మానుకున్నారు. దీంతో హోమ్‌ఫుడ్స్‌కు ఆదరణ పెరిగింది. వినియోగదారుల అభిరుచి మేరకు బెల్లం, పంచదార, నెయ్యి, జీడిపప్పు, నువ్వులు వంటివి జోడిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సుగర్‌లెస్ స్వీట్లు కూడా సరఫరా చేస్తున్నారు. పిండివంటలు తయారుచేసి అందించే కుటీర పరిశ్రమలు విశాఖ నగరంలో వందల్లో వెలిశాయి. స్వీట్లు, బేకరీ ఐటెమ్స్ తయారు చేసే పెద్ద సంస్థలు కూడా రకరకాల పిండివంటలు సిద్ధం చేసి వినియోగదారులకు ఆహ్వానం పలుకుతున్నాయి. పండగ ప్రత్యేకతగా వెదురు బుట్టలలో నింపి ఇళ్లకు డెలివరీ చేస్తున్నారు.

సంప్రదాయ పిండివంటకాలూ లభ్యం..

ప్రస్తుతం మార్కెట్లో సంప్రదాయ పిండివంటలైన అరిసెలు, జంతికలు, సున్నపాకుండలతో పాటు బుల్లెట్ పాకుండలు, సున్నుండలు, తొక్కుడు లడ్డు, తదితర పిండివంటలు లభ్యమవుతున్నాయి.

పేకాట, కోడిపందాల శిబిరాలపై దాడి

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దులో ఆదివారం కోడిపందాలు నిర్వహిస్తుండగా భీమిలి సీఐ బి.సుధాకర్, ఎస్ఐ గంటా హరీష్ దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 6 కోళ్లు, రూ.12,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆనందపురంలో ఆదివారం పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ సంతోష్ దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.9,010 స్వాధీనం చేసుకున్నారు. నేలేరు గ్రామంలో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.